


హత్యకు గురైన తల్లీకూతుళ్లు (ఫైల్)

తండ్రీ కొడుకులకు ఉరిశిక్ష

- జంట హత్యల కేసులో భర్త, మామలకు ఉరి, అత్తకు యావజ్జీవం
- ఏడాదిలోపే సంచలన తీర్పు ఇచ్చిన కర్నూలు నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు

కర్నూలు కోర్టులో సంచలనాత్మక తీర్పు వెలువడింది. ఓ కేసులో తండ్రీ కొడుకులకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. మరొకరికి జీవిత ఖైదు విధించింది. కర్నూలు నాలుగో అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఇప్పుడు సంచలనంగా మారింది. పెళ్లయిన పద్నాలుగు రోజులకే అనుమానంతో భార్య, అత్తను చంపి మామను తీవ్రంగా గాయపరిచిన కేసులో ఇద్దరికి ఉరి శిక్ష, ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ కర్నూలు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి జి. ప్రతిభాదేవి బుధవారం సంచలన తీర్పునిచ్చారు.

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 21: ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల పట్టణానికి చెందిన నారపురం వరప్రసాద్, నారపురం రమాదేవి, వారి కుమారుడు నారపురం శ్రావణ్ కుమార్‌లు కర్నూలు నగరంలోని కల్లూరు చింతమునినగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. కాగా శ్రావణ్ కుమార్‌కు గతేడాది మార్చి ఒకటో తేదీన తెలంగాణ రాష్ట్రం వనపర్తి పట్టణానికి చెందిన కొత వెంకటేశ్, రమాదేవిల కుమార్తె రుక్మిణితో వివాహం జరిగింది. అయితే పెళ్లయిన మూడు రోజులు కూడా వారి మధ్య శోభనం జరగలేదు. దీంతో నవ వధువు తండ్రి వరప్రసాద్, ఆమె తల్లి రమాదేవి అల్లుడు శ్రావణ్ కుమార్‌పై అనుమానపడ్డారు. శ్రావణ్‌కు మగతనం లేకపోవడంతోనే వారి మధ్య శోభనం జరగలేదంటూ అల్లుడితో పాటు వియ్యంకులపై గొడవపడ్డారు. అయితే.. రుక్మిణికి వివాహేతర సంబంధం ఉందని అందుకే వారి మధ్య శోభనం జరగలేదని శ్రావణ్ కుమార్, అతడి తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో రుక్మిణిని ఆమె తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకెళ్లారు. అయితే ఈ విషయం అందరికీ తెలిస్తే తమ పరువుపోతుందని భావించిన నిందితులు రుక్మిణితో పాటు ఆమె తల్లిదండ్రులను హత మార్చాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత ప్రణాళిక ప్రకారం గత ఏడాది మార్చి 11న శ్రావణ్ కుమార్ తన రుక్మిణి (19)ని,


శిక్షకు గురైన నిందితులు శ్రావణ్ కుమార్, వరప్రసాద్, రమాదేవి

అత్త రమాదేవి (32)ని, మామ వెంకటేశ్‌లను వనపర్తి నుంచి కర్నూలుకు తీసుకువచ్చారు. తమ పథకంలో భాగంగా తల్లి కృష్ణవేణిని ఇంటి బయట కాపలాగా ఉంచి శ్రావణ్ కుమార్ వరప్రసాద్‌తో



కలిసి రుక్మిణిని, రమాదేవిని కత్తులతో పొడిచి హత్య చేశారు. అడ్డు వచ్చిన వెంకటేశ్‌ను కూడా తీవ్రంగా గాయపరిచారు. వీరి కేకలు విన్న ఇరుగు పొరుగు వారు అక్కడకు రావడంతో నిందితులు పారిపోయారు. వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు నాల్గవ పట్టణ సీఐ పి. శంకరయ్య కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో శ్రావణ్ కుమార్, అతడి తండ్రి వరప్రసాద్‌కు ఉరి శిక్ష, వారికి సహకరించిన తల్లి కృష్ణవేణికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. ప్రకాష్ రెడ్డి వాదనలు వినిపించారు. హత్య జరిగిన ఏడాదిలోపే కేసును విచారించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి తీర్పు కూడా వెలువరించడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో 90 రోజుల్లో విచారణ పూర్తి చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేసిన కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, నాలుగో పట్టణ సీఐ పి. శంకరయ్యను జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ అభినందించారు.



గళం విప్పిన కలం వీరులు

- వైసీపీ మూకల దాడిపై తీవ్ర నిరసన
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రోడ్డెక్కిన జర్నలిస్టులు
- టీడీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన నేతల మద్దతు
- కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఎన్టీయార్ సర్కిల్‌లో రాస్తారోకో
- అడిషనల్ ఎస్పీ నాగరాజుకు వినతి పత్రం

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 21: కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు, వైసీపీ మూకల దాడులు.. మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కే వీరశేఖర్‌పైన వైసీపీ దాడిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు రోడ్డెక్కారు. జర్నలిస్టులపై దాడులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు కలెక్టరేట్ ముందు మహాత్ముని విగ్రహం వద్ద ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమానికి టీడీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన, రాయలసీమ విద్యార్థి సంఘం సహా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ వంటి ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు హాజరై తమ సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఈనాడు కార్యాలయంపై, ఆంధ్రజ్యోతి రిపోర్టర్‌పై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. ధర్నాలో, రాస్తారోకో కార్యక్రమాల్లో తమ సంఘీభావం తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఐజేయూ జాతీయ కమిటీ సభ్యులు కే నాగరాజు, గోరంట్ల కొండప్ప, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్‌వీ సుబ్బయ్య, గౌరవ సలహాదారు కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు


నిరసన తెలుపుతున్న ఏపీయూడబ్ల్యూజే, టీడీపీ నాయకులు

ఈఎన్ రాజు, శ్రీనివాసగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి అంజి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, టీడీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పాణ్యం, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిలు గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు మద్దిలేటి, జిల్లా కన్వీనర్ నాగేంద్ర, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ నారాయణ, జనసేన కర్నూలు కన్వీనర్ హర్షద్, నాయకుడు పీబీవీ సుబ్బయ్య, ఈనాడు స్టాఫ్ రిపోర్టర్ రామకృష్ణ, ఈటీవీ స్టాఫ్ రిపోర్టర్ శ్యామ్, సీమ కృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రతిపక్షాల కార్యకర్తలు కలెక్టరేట్ ముందు మహాత్ముని విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేశారు. పోలీసులు రోడ్డుపై బైఠాయించిన జర్నలిస్టులు, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులను బలవంతంగా తోసి వేయడంతో అక్కడ వాగ్వివాదం జరిగింది. ఈనాడు కార్యాలయం, ఆంధ్రజ్యోతి విలేకరిపై వైసీపీ మూకలు దాడి చేయడం అనైతికమైన, హేయమైన చర్య అని నాయకులు విమర్శించారు. తమకు వ్యతిరేక వార్తలు రాస్తే దాడులు చేస్తారా..? ఇదెక్కడి ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు.


మద్దతు తెలిపిన ప్రజా సంఘాల నాయకులు


రోడ్డుపై బైఠాయించిన టీడీపీ నాయకులు

ఏఎస్పీ నాగరాజుకు వినతి పత్రం

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నాయకులు జిల్లా అడిషనల్ ఎస్పీ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, అరెస్టు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు విశ్వనాథరెడ్డి, అంజి, స్నేహాల్, శివ, వెంకటేశ్, సీసీఎం నగర కార్యదర్శులు రాముడు, నగేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రామాంజినేయులు, జనసేన నాయకుడు శేఖర్, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల నాగేంద్ర, హనుమంతరావుచౌదరి, మహేష్‌గౌడ్, పీజీ నరసింహులు యాదవ్ పాల్గొన్నారు.


నిరసనకారులను అడ్డుకుంటున్న త్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి

ఆ రోజే పత్రికలపై అక్కసు వెళ్లగక్కారు: ఐవీ సుబ్బారావు

జగన్మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలి సభలోనే పత్రికలపై తన అక్కసు వెళ్లగక్కారని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయం, ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలో మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడులు చేయడం చూస్తే రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలవుతోందా అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పాణ్యం, ఆలూరు ఇన్‌చార్జిలు గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థపై జగన్, వైసీపీ ఎమ్మెల్యేలకు నమ్మకం లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలను భయాందోళనకు గురి చేసేందుకే పత్రికలు, జర్నలిస్టులపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఈనాడు కార్యాలయంపై దాడి చేశారని, దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై కేసులు



నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం నాయకులు రామకృష్ణ, కేవీ నారాయణ, జనసేన కన్వీనర్ హర్షద్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు సీమకృష్ణలు మాట్లాడుతూ పత్రికలపై దాడులను ఖండిస్తున్నామని చెప్పారు.


శివాజీ గోపురంపై కలశప్రతిష్ఠలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి

వైభవంగా మహా కుంభాభిషేకం

పాల్గొన్న కంచి, శ్రీశైలం జగద్గురు, పుష్పగిరి, కాశీ పీఠాధిపతులు

శ్రీశైలం, ఫిబ్రవరి 21: భూ మండలానికి నాభి స్థానమైన శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం మహా కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమాన్ని దేవస్థానం వైభవంగా జరిపించింది. ఆరు రోజులపాటు నిర్వహించిన ఈ మహిమాన్విత కార్యక్రమంలో విధివిధానంగా కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి, జప, పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపారు. రాష్ట్ర కల్యాణం, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన మహాకుంభాభిషేకం మహోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రతి రోజూ విశేష పూజలు, దేవతాహవనాలు, దేవహవనాఉ, జపాలు, పారాయణాలు జరిపించారు. ఉదయం 7గంటల నుంచి మహాకుంభాభిషేకం క్రతువులలో భాగంగా శాంతి హోమం, పౌష్టిక హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు పూర్తి చేసి అనంతరం ఆలయంలో పునర్నిర్మించిన శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో పునరుద్ధరించిన కొన్ని ఉప ఆలయాలు, పంచమఠాలలోని మూడు మఠాలలో యంత్ర, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను శాస్త్రానుసారంగా చేశారు. అనంతరం ప్రధానాలయంలోని స్వామివారి గర్భాలయ విమానం, అమ్మవారి గర్భాలయ విమానం, నాలుగు దిక్కుల ప్రధాన గోపురాలు, అమ్మవారి ద్వార గోపురం, ఆలయ ప్రాంగణంలోని అన్ని గోపురాలు, క్షేత్ర పరిధిలోని ఉప ఆలయాలకు ఏకకాలంలో మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ మహిమాన్విత కార్యక్రమంలో కంచికామకోటి పీఠాధిపతులు విజయేంద్ర సరస్వతి మహాస్వామి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాషుస్వామి, కాశీ పీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వళవన్, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ ఎస్.ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, విజయవాడ దుర్గాదేవి ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


స్వామివారి ఆలయం గోపురంపై త్రిశూల కలశాలకు పూజలు

తాగునీటి సమస్య పరిష్కరించండి

- పింఛన్లు రావడం లేదని జనం తిడుతున్నారు
- జడ్పీటీసీల ఆందోళన ● ముగిసిన సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 21: ఉమ్మడి జిల్లాలోని కొన్ని గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలోని కొన్ని మండలాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో బుధవారం జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి, ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు డా.జి. సృజన, కే. శ్రీనివాసులు, జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసర రెడ్డి, కర్నూలు ఎంపీ డా. సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ మధుసూదన్ పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించి అజెండాలో ఉన్న శాఖలు గ్రామీణ నీటి సరఫరా విభాగం, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్ బడ్జెట్‌పై చర్చించారు. మిగతా శాఖలపై ఎటువంటి చర్చ జరగలేదు.

● మద్దికెర, జుపాడుబంగ్లా, ఓర్వకల్లు, కొత్తపల్లి, ఆత్మకూరు, వెల్దుర్తి, గూడూరు, ఆస్పరి, చిప్పగిరి, సీ. బెళగల్ మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉందని, రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని జడ్పీటీసీలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెల్దుర్తి మండల కేంద్రంలో వైఎస్ఆర్ సుజల స్రవంతి మూసివేడయంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని జడ్పీటీసీ సుంకన్న తెలిపారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలోని తన ఇంట్లోనే నీటి సమస్య ఉందని ఎంపీపీ సునీత అన్నారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం, గువ్వలకుంటలో భూగర్భజలాలు పూర్తిగా ఎండిపోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఉందని జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం కరివేన, కురుకుంద గ్రామాలలో సమస్య ఉందని జడ్పీటీసీ శంకర్‌రెడ్డి, ఓర్వకల్లు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నీటి వసతి కొరత ఉందని తక్షణమే బోర్లు వేయాలని జడ్పీటీసీ రంగనాథగౌడు, మిడ్తూరు మండలంలోని 24 గ్రామాలలో నీటి సమస్య ఉండటంతో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారని జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, జుపాడుబంగ్లా మండల కేంద్రంలోని నీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో నుసి పురుగులు వస్తున్నాయని.. ఈఓఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు అస్సలు స్పందించడం లేదని జడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి కోరారు. ఆస్పరిలో, చిప్పగిరిలో నీటి సమస్యను పరిష్కరించాలని జడ్పీటీసీలు కోరారు.

● బడ్జెట్‌పై ప్రశ్నించిన మంత్రి... తెల్లమొహం వేసి సీఈఓ

సమావేశంలో జిల్లా పరిషత్ 2023-24వ ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్, 2024-2-25 ఆర్థిక సంవత్సర అంచనాల బడ్జెట్‌లో జిల్లా పరిషత్ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి వివరించారు. ఇటీవల స్థాయిసంఘాల సమావేశంలో ఆమోదం తెలిపిన బడ్జెట్‌ను సర్వసభ్యసమావేశంలో కూడ ఆమోదం కోసం తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో సీనరేజ్ గ్రాంట్ 25023-24 ఎంత చూపించారు, ఇసుక సెస్ వస్తుందా లేదా అని జడ్పీ సీఈఓని ఆయన ప్రశ్నించారు.

పాఠశాలలు, హాస్టళ్లకు తాగునీరు అందివ్వండి ...

జిల్లాలోని పాఠశాల, హాస్టళ్లలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లోని ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్వాహణ ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి చూసుకోవాలి. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేసుకోవాలి.

బుగ్గన రాజేంద్రనాథరెడ్డి,
రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి



మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

● ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహకరించండి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అన్ని వర్గాలకు అందేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. జలజీవన్ మిషన్ కింద కర్నూలు జిల్లాకు రూ.530, నంద్యాల జిల్లాకు రూ.300 కోట్లు ఉన్నాయి. కోడుమూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాజులదిన్నె డ్యాంలో 2 టీఎంసీ నీటి నిల్వలు ఉంచాం.

– యర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీ చైర్మన్

● **ఇదీ హాజరు:** జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశానికి ఒక మంత్రి, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ వెంకటసుబ్బారెడ్డి, వైస్ చైర్మన్లు దిల్షాద్‌నాయక్, కురువ బుజ్జమ్మ, కో ఆప్టెడ్ సభ్యులు సయ్యద్ అస్లాం ఖాద్రి, సయ్యద్ సులేమాన్, జడ్పీటీసీ, ఎంపీపీలు పాల్గొన్నారు.

భర్తే కడతేర్చాడు

మద్యానికి బానిసై భార్యను హతమార్చిన వైనం



జయలక్ష్మి (ఫైల్)

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 21: జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్తే భార్య పాలిట కాలయముడయ్యాడు. మద్యానికి బానిసై భార్యను హత మార్చాడు. ఈ ఘటన మండల పరిధిలోని గంగులపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కోసిగి మండలం సజ్జల గూడెం గ్రామానికి చెందిన జయలక్ష్మిని పెద్దకడబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన నాగేష్‌కు 15 ఏళ్ల క్రితం ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరు కూలి పనులు చేసుకొని జీవనం సాగించేవారు. కూలి పనుల కోసం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ భవన నిర్మాణ పనులు చేస్తుండగా గోడ కూలి నాగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరు తిరిగి స్వగ్రామానికి చేరుకొని కూలి పనులు చేసుకుంటూ జీవనవం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో సొంతంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. అయితే భర్త నాగేష్ మద్యానికి బానిసై ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొనక పోగా మద్యం మత్తులో భార్య జయలక్ష్మిని చిత్రహింసలకు గురి చేసేవాడు. మంగళవారం రాత్రి సైతం మద్యం తాగి రావటంతో భార్య నిలదీసింది. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆ తరువాత నాగేష్‌తోపాటు అందరూ భోజనం చేసి పడుకున్నారు. అయితే బుధవారం ఉదయం నాగేష్ తల్లి పిల్లలను నిద్ర లేపేందుకు తలుపు తెరిచి చూడగా రక్తపు మడుగులో కోడలు జయలక్ష్మి(34) విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి గట్టిగా కేకలు వేసింది. నిద్రమత్తులో ఉన్న భార్య జయలక్ష్మిని భర్త నాగేష్ ఇంట్లో ఉన్న గొడ్డలితో మెడపై కర్కశంగా నరికి చంపినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ ప్రసాద్, పోలీసలు సంఘటనా స్థలానికి చేరుకొని జయలక్ష్మి మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలుసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జయలక్ష్మి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ము గ్గురు పిల్లలు తల్లి మృతదేహం దగ్గర రోదించటం చూపరులను కన్నీరు పెట్టించింది.

హంద్రీలో పడి వ్యక్తి మృతి

దేవనకొండ, ఫిబ్రవరి 21 : గుండ్లకొండ హంద్రీ నీవా కాలువ వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాలువలో పడి కర్నూలుక చెందిన జశ్వంత్ (24) మృతి చెందాడు. మండలంలోని గుండ్లకొండ గ్రామంలో ధ్వజ స్తంభ ప్రతిష్టకు కర్నూలు నుండి బ్రహ్మణులు పూజలు నిర్వహించేందుకు వచ్చారు. వారిలో జశ్వంత్ వచ్చాడు. ఆయన తనతో పాటు మరొకరిని తోడుగా తీసుకొని హంద్రీ కాలువకు స్నానానికి వెళ్లాడు. లోతుగా వున్న ప్రాంతంలో అదుపు తప్పడంతో ఈత రాక జశ్వంత్ కాలువలో కొట్టుకుపోయాడు. పోలీసులు ఈతగాళ్లతో కాలువలో వెతికించి, జశ్వంత్ మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడి బలవన్మరణం

వెల్దుర్తి, ఫిబ్రవరి 21: చెట్టుకు ఉరివేసుకొని పదమూడేళ్ళ బాలుడు బలవన్మరణానికి గురయ్యాడు. ఈ ఘటన మండలంలో జరిగింది. మండలంలోని ఓ గ్రామంలో బుధవారం ఉదయం మామిడితోటలోని చెట్టు కొమ్మకు వేలాడుతూ ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

స్టైఫండ్ కోసం జూనియర్ డాక్టర్ల ఆందోళన

● గేట్లకు తాళం.. అక్కడే బైఠాయింపు



కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 21: గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్స్‌ను చెల్లించాలని కోరుతూ బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట జూనియర్ డాక్టర్లు ఆందోళన నిర్వహించారు. దాదాపు 188 మంది హౌస్ సర్జన్లు సూపరింటెండెంట్ చాంబర్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది గేట్లను మూసివేశారు. దీంతో గేట్ల ఎదుట హౌస్ సర్జన్లు బైఠాయించి ఆందోళన చేశారు. హౌస్ సర్జన్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మెర్సి, నిఖిల్ నాయకులు ప్రీతి, తేజస్, అఖిల్ మాట్లాడుతూ గత 5 నెలలుగా ప్రభుత్వం ఉపకార వేతనాలు చెల్లించడం లేదని, దాదాపు 2.10 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 29న హౌస్ సర్జన్లు కోర్సు పూర్తవుతుందని 8 రోజుల్లో బకాయిలు ఇవ్వాలని కోరారు.

'ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...'

స్టైఫండ్ బకాయిలు గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకట రంగారెడ్డి ఆందోళన చేస్తున్న హౌస్‌సర్జన్ల దగ్గరకు వెళ్లి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించండి

● ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి కె.రమేష్‌బాబు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: పార్లమెంటు, శాసనసభల ఎన్నికల నేపథ్యంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నివేదికలు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా నోడల్ అధికారి కె.రమేష్ బాబు, ఎస్.రామాంజనేయులు సూచించారు. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిశ్రమల కేంద్రం సమావేశ భవనంలో ఎన్నికల వ్యయం గురించి అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్, అకౌంటింగ్ టీములకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ అధికారి ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి కె. రమేష్‌బాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎన్నికల ఖర్చుల రకాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో వ్యూయింగ్, ఎక్సైజ్, అకౌంటింగ్, ఎంసీఎంసీ బృందాలు నిర్వహించాల్సిన విధులను అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్, అకౌంటింగ్ టీములకు వివరించారు. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40లక్షలు వరకు ఖర్చు చేసేందుకు అనుమతి ఉందన్నారు. అంతకుమించి ఖర్చు చేస్తే వారు పోటీ చేసే అర్హత కోల్పోతారన్నారు. రూ.10 లక్షలకు మించి ఎక్కడైనా నగదు పట్టుకుంటే ఆదాయపు పన్ను అధికారులకు తెలియజేసి సీజ్ చేయించాలన్నారు. స్టార్ క్యాంపెయినర్ వద్ద రూ.1 లక్ష వరకు ఉంచుకునేందుకు అనుమతి ఉందన్నారు. వ్యయ నోడల్ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ ఎవరైనా సరే రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తుంటే పట్టుకోవాలని, రూ.10వేలు విలువ చేసే బహుమతులు, వస్తువులు ఉంటే సీజ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు తమ ఖర్చుల నివేదికలను మూడుసార్లు వ్యయ పరిశీలకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచార ప్రకటనల కోసం తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) వద్ద ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. చెల్లింపు వార్తలను గుర్తించి అభ్యర్థుల ఖాతాలో ఖర్చు కింద జమ చేయాల్సి ఉంటుందన్నారు.

ఆటో డ్రైవర్లపై స్పెషల్ డ్రైవ్

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 21: ఆటో డ్రైవర్లకు ఎదురవుతున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బుధవారం స్థానిక లోక్ అదాలత్ భవనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. డ్రైవర్లు ఆటోల రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను విచారించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాస రావు వారికి అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై నన్నూరు గ్రామ సమీపాన ఈశ్వర్ గోడౌన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫక్కీర్‌సాబ్ (35) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన ఫక్కీర్‌సాబ్ తడకనపల్లె నుంచి బనగానపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తూ.. నన్నూరు వద్ద ముందు వైపు వెళ్తున్న ఈశ్వర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఫక్కీర్‌సాబ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం వెనుక అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఓర్వకల్లు పొగాకు కంపెనీలో పని చేస్తున్న ఈశ్వర్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

ఓటమి భయంతోనే దాడులు


● టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 21: ఓటమి ఖాయమని తెలిసి సీఎం జగన్మోహన్‌రెడ్డి మీడియా పై వైసీపీ గుండాలను దాడులకు ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీడియా అన్నా, ప్రశ్నించే ప్రతిపక్షాలన్నా సీఎం జగన్ భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. దాంతోనే తన పార్టీ నాయకులను, కార్యకర్తలను, గుండాలను దాడులకు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. నగరంలోని ఈనాడు కార్యాలయంపై వైసీపీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తుని ఆంధ్రజ్యోతి విలేఖరి హత్య, పోలవరం ప్రజాశక్తి విలేకరిపై వైసీపీ రౌడీ మూలక దాడి, అమరావతిలో పరమేశ్వర రావు, రాప్తాడులో శ్రీక్రిష్ణ, మద్దికెరలో వీరశేఖర్‌పై దాడి, కర్నూలులో ఏకంగా ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడి ఇదంతా అందులో భాగమే అన్నారు. జగన్‌రెడ్డి పాలనలోని అవినీతి, అక్రమాలు, అరాచకాలను ఇంత వరకు ఓర్పుతో భరించిన ప్రజలు ఇప్పుడు తిరగబడుతున్నారని అన్నారు. వైసీపీ నాయకుల అక్రమాలను బయట పెడుతున్న మీడియా మీద దాడులకు దిగడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. ఎన్ని దాడులు చేయించినా వాస్తవాలను దాచలేరని, వైసీపీ చేసినదానికి రాబోయే రోజుల్లో ప్రతిఫలం అనుభవించాల్సి ఉంటుందని అన్నారు.

రోళ్లపెంట ఘాట్‌లో రెండు లారీలు ఢీ

● రక్షణ గోడను తగిలి రోడ్డుపై అడ్డంగా నిలిచిన లారీ, మరో లారీ బోల్తా
● నాలుగు గంటల పాటు నల్లమలలో ట్రాఫిక్ జామ్



నల్లమలలోని రోళ్లపెంట ఘాట్‌పై ఢీకొన్న లారీలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: నల్లమలలోని రోళ్లపెంట ఘాట్‌లో బుధవారం ప్రమాదవశాత్తు రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై సుమారు నాలుగు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. బుధవారం ఉదయం 7గంటల సమయంలో గుంటూరు నుంచి ఆత్మకూరు వైపు వరి ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీ రోళ్లపెంట ఘాట్ దిగే క్రమంలో రెండో మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ అయింది. దీంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టి బోల్తా పడింది. ఎదురుగా వచ్చిన లారీ ఘాట్ రోడ్డు రక్షణ గోడకు తగిలి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో కనీసం బైక్ కూడా రోడ్డు దాటేందుకు వీలు లేకపోవడంతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని, ఎక్స్‌కవేటర్ సాయంతో రక్షణ గోడను తగిలి రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీని పక్కకు తప్పించారు. మరో లారీలో ఉన్న వరిధాన్యాన్ని ఇంకో వాహనంలోకి తరలించి ఖాళీ లారీని పక్కకు జరిపించరు. ఉదయం 11గంటలకు రెండు లారీలను రోడ్డుపై నుంచి పక్కకు తప్పించడంతో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి.

చెట్టును ఢీకొన్న కారు

- రాచర్ల ఎస్ఐ దుర్మరణం
- డ్రైవర్, అల్లుడు కూడా మృతి
- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ వద్ద ఘటన



పవన్‌సాయి (ఫైల్)



కారులో ఇరుక్కొని దుర్మరణం చెందిన ఎస్ఐ వెంకటరమణ



చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు



ఎస్ఐ వెంకటరమణ (ఫైల్)

ప్యాపిలి, ఫిబ్రవరి 21 : మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి మండలంలోని రాచెర్ల ఎస్ఐ నంబూరి వెంకటరమణ దుర్మరణం పాలయ్యాడు. అతివేగంగా వెళుతూ అదుపు తప్పిన కారు చెట్టును ఢీకొన్న సంఘటనలో ఎస్ఐతో పాటు మరో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన నంబూరి వెంకటరమణ రాచర్ల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఈయన కుమార్తె అనూషను హైదరాబాద్‌లోని మనికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్న పవన్‌సాయికి ఇచ్చి ఈ నెల 15వ తేదీన ఘనంగా వివాహం జరిపించారు. ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లోని వరుడి ఇంటి దగ్గర నిర్వహించిన విందుకు ఎస్ఐ వెంకట రమణ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఎస్ఐ వెంకటరమణ, అతని కూతురు అనూష, అల్లుడు పవన్‌సాయి, కారు డ్రైవర్ చంద్ర కలిసి కారులో తిరిగి అనంతపురానికి బయలుదేరారు. భూత్పూర్ మండలంలోని అన్నసాగర్ గ్రామం సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో ఎస్ఐ వెంకటరామణ (55), అల్లుడు పవన్ సాయి (25), కారు డ్రైవర్ చంద్ర (27) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులో ఉన్న కూతురు అనూషకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అనూషను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివాహం జరిగిన వారం రోజులకే కాళ్లకు పారాణి ఆరకముందే నూతన వరుడు పవన్‌సాయి కానరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యుల రోదనలు కంటతడి పెట్టించాయి. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూతూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఐ వెంకటరమణ మృతితో ప్యాపిలి సీఐ సుధాకర్ రెడ్డి, రాచెర్ల, ప్యాపిలి, జలదుర్గం పోలీసులు సంతాపం వ్యక్తం చేశారు.

దగా డీఎస్సీని రద్దు చేయాలి

● 26న అనంతపురం నుంచి కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం
● నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 21: వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన దగా డీఎస్సీని రద్దు చేసి, మెగా డీఎస్సీని విడుదల చేయాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం డీసీసీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ నిరుద్యోగులకు హామీ ఇస్తూ అధికారంలోకి వస్తే ప్రతి ఏటా డీఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి పదవీ కాలం ముగుస్తున్నా హామీని నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులందరూ జగన్‌ను ఓడించి గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 30 వేల టీచర్ పోస్టులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన అనంతపురంలో కాంగ్రెస్ నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల శంఖారావాన్ని పూరించబోతున్నట్లు వెల్లడించారు. అనంతపురంలో జరిగే ఎన్నికల శంఖారావానికి ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, తదితరులు ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు.

మీడియా స్వేచ్ఛను హరించే నాయకులపై చర్యలు తీసుకోవాలి:

మీడియా స్వేచ్ఛను హరించే నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జె. లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. రాప్తాడు సిద్ధం సభలో ఫొటో గ్రాఫర్ కృష్ణపై దాడి జరిగిన ఘటన మరువక ముందే, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ గుండాల దాడి, మద్దికేర ఆంధ్రజ్యోతి విలేఖరిపై వైసీపీ మూకల దాడి దుర్మార్గమని అన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, పట్టణ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, కోఆర్డినేషన్ సభ్యుడు ఫరూక్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా గర్భిణి మృతి

● భర్త, అత్త, మామలపై కేసు నమోదు
● కలెక్టరేట్ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన
● పోలీసుల దాడి, పరిస్థితి ఉద్రిక్తం

కర్నూలు, ఫిబ్రవరి 21: నగరంలో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామప్రియనగర్‌కు చెందిన మెగావత్ శిరీష (25) అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుందని, భర్త, బంధువులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. శిరీష బంధువులు కర్నూలుకు చేరుకుని తమ కూతురు ఆత్మహత్య చేసుకోలేదని, అత్త, మామ, భర్త, మరిది కలిసి హత్య చేశారని ఆరోపించారు. ఆత్మకూరు మండలం సంజీవనగర్ తండాకు చెందిన శిరీషకు కర్నూలుకు చెందిన ఏఎస్ఐ తిరుపాలు నాయక్ కొడుకు శ్రీకాంత్ నాయక్‌తో 9 నెలల కింద పెళ్లయింది. శ్రీకాంత్ నాయక్ రైల్వేలో పీసీగా పని చేస్తున్నాడు. 7 నెలల గర్భిణి అయిన శిరీష అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. పెళ్లయినప్పటి నుంచి శిరీష భర్త, అత్త రుక్మిణిబాయి, మామ తిరుపాల్‌నాయక్, మరిది పురేంద్రనాయక్ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారనీ, అదనపు కట్నం కోసం డిమాండ్ చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. పోలీసులు శిరీష మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

● మృతదేహం అప్పగింతపై ఉద్రిక్తత:

శిరీష మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని తీసుకెళ్లడం, అంత్యక్రియల నిర్వహణపై ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తమ సంప్రదాయం ప్రకారం అత్త మామలే అంత్యక్రియలు చేయాలని మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు పట్టుబట్టారు. సుమారు 50 మందికి పైగా ఆమె బంధువులు మార్చురి వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. అయితే.. మృతురాలి భర్త, అత్తమామలు ఎవరూఆ వైపు రాలేదు. పోలీసులు మాత్రం ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లాలని పట్టుబట్టారు. దీంతో ఆమె బంధువులు గాంధీ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కాస్త రాస్తారోకోగా మారడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీఐలు మురళీధర్ రెడ్డి, ఇంతియాజ్‌ల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న బంధువులను పోలీసులు జీపు ఎక్కించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, మృతురాలి బంధువుల మధ్య వాగ్వాదం నెలకొంది. కొంత మంది పోలీసులు మృతురాలి బంధువులపై విచక్షణారహితంగా దాడి చేశారు. బూటుకాళ్లతో కింద పడేసి కొట్టడం వివాదాస్పదంగా మారింది. తమకు న్యాయం చేయాలని కోరితే.. తమపైనే పోలీసులు దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిరీష మామ తిరుపాల్ నాయక్ ఏఎస్ఐ కావడంతో పోలీసులు పక్షపాత ధోరణి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మృతదేహం మాత్రం బుధవారం రాత్రి వరకు మార్చురీలో ఉండిపోయింది. శిరీష బంధువుల ఫిర్యాదు మేరకు తిరుపాల్ నాయక్, ఆయన భార్య రుక్మిణిబాయి, కొడుకులు శ్రీకాంత్ నాయక్, పురేంద్ర నాయక్‌లపై కేసు నమోదు చేశామని సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

దేవనకొండ, ఫిబ్రవరి 21: పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలను ఆర్పే క్రమంలో విద్యుత్ తీగను పట్టుకొని బేతపల్లి గ్రామానికి చెం దిన రైతు సురేంద్ర(30) విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు తనకున్న పొలంలో మిరప, వేరుశనగ సాగు చేస్తున్నాడు. నీరులేక పం టలు ఎండిపోతుండటంతో కొత్తగా బోరు వేసి ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. గ్రామంలోని 3వ వార్డు సభ్యుడిగా టీడీపీ మద్దతుతో సురేంద్ర గెలిచారు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేంద్ర మృతికి టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి నర్సారావు నివాళి ప్రకటించారు. ప్రభుత్వం సురేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

సిద్ధం పేరుతో ప్రజలపై యుద్ధం

గౌరు చరిత, మల్లెల రాజశేఖర్



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21: సిద్ధం పేరుతో సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజలపై, పాత్రికేయులపై యుద్ధం ప్రయోగిస్తున్నారని టీడీపీ పాణ్యం ఇన్‌చార్జి గౌరు చరిత, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని కాల్వ గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభలో పత్రికలను విమర్శించడంతో వైసీపీ అల్లరిమూకలు రెచ్చిపోయి జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపైన దాడులు చేయించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు టీడీపీ మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, కాపు సంఘం యువ నాయకుడు కేవీ మధు, తెలుగు యువత అధ్యక్షుడు రామచంద్రుడు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ సుధాకర్, నాయకులు ఖాదర్ బాషా, రజాక్, ప్రశాంత్, బజారు, జగదీష్, సుల్తాన్, శాలుబాషా పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరిక:** కాల్వగ్రామ మాజీ సర్పంచ్ బాకర్‌సాహేబ్ కుమారుడు జోకర్‌బాషా ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి గౌరు చరిత, మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పందిపాడులో పరిటాల శ్రీరామ్



కల్లూరు, ఫిబ్రవరి 21: కల్లూరు మండలం పందిపాడు గ్రామానికి చెందిన గుమ్మల్ల ఆంజనేయులు నివాసాన్ని అనంతపురం జిల్లా ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సందర్శించారు. బుధవారం కర్నూలు నగరంలో ఓ కార్యక్రమానికి విచ్చేసిన పరిటాల శ్రీరాం జి.ఆంజనేయులు నివాసానికి చేరు కున్నారు. అనారోగ్య కారణాలతో విజయవాడలో చికిత్స తీసుకుని స్వగ్రామం పందిపాడుకి వచ్చిన ఆప్తుడిని కలుసుకుని కుటంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పందిపాడుకు చెందిన టీడీపీ నాయకుడు గూడూరు శేఖర్‌చౌదరి పరిటాల శ్రీరామ్‌ని పూలమాలతో సన్మానించారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని, క్షేత్రస్థాయిలో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి చంద్రబాబును సీఎంగా గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మణ్ యాదవ్, నాగరాజు, శివరామాంజనేయులు, బాలశంకర్‌రెడ్డి, హనుమంతరావు చౌదరి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి నంద్యాలలో హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 21: నంద్యాల పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటి ప్రతినిధులు నిమ్మకాయల సుధాకర్, మహబూబ్‌బాషా, రాజ్‌కుమార్ రెడ్డిలు బుధవారం తెలిపారు. క్రీడాకారులకు కళాశాల మైదానంలో వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే నంది పైపుల మేనేజింగ్ డైరెక్టర్ సృజల భోజన ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబ రిచిన క్రీడాకారులను ఏపీ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీలను 23న సాయంత్రం 4.30 గంటలకు ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి ప్రారంభిస్తున్నట్ల తెలిపారు.

25న పురుషుల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 21: స్థానిక జిల్లా ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 25న ఉమ్మడి జిల్లాల పురుషుల కబడ్డీ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున రెడ్డి, సుభాకర్ బుధవారం తెలిపారు. 70వ ఆంధ్రప్రదేశ్ కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పురుషుల కబడ్డీ పోటీలు ఏలూరులో జరుగుతాయని తెలిపారు. పురుషులు 85 కేజీలలోపు ఉండాలని, వచ్చేటప్పుడు ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. వివరాలకు 9701012329 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 21: పంట రుణాలు తీసుకున్న రైతులను వైసీపీ ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందని రైతు సంఘం జిల్లా కార్య దర్శి జగన్నాథం అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పంట రుణాలు తీసుకుంటే ప్రభుత్వమే బ్యాంకులకు వడ్డీని చెల్లించేదని, ఆ విధా నాన్ని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. గత సంవత్సరం రైతులు పంట రుణాలు తీసుకుని సకాలంలో వడ్డీని కూడా చెల్లించారని, అయితే.. ఇప్పటిదాకా సున్నా వడ్డీ డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయక పోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విలేకరులపై దాడులు సిగ్గు చేటు

టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21: విలేకరులు, మీడియా కార్యాలయాలపై దాడులు చేయడం సిగ్గు చేటని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. బుధవారం పాత్రికేయుల ఆధ్వర్యంలో ఓర్వకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. హుశేనాపురం రహదారిపై మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాజశేఖర్, గోవిందరెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి మరువకముందే.. ఆంధ్రజ్యోతి మద్దికెర రిపోర్టర్ వీరశేఖర్‌పై దాడి చేయడం, అలాగే కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. సీఎం జగన్ దాడులు చేసిన వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, నాగమల్లేష్, వేణు, బజారు, ఖాదర్, గడేకారి శేఖర్ పాల్గొన్నారు.

విలేకరులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

కర్నూలు(అర్బన్): విలేకరులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈనాడు కార్యలయంపై దాడి, మద్దికెర విలేకరి వీరశేఖర్‌పై దాడి ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బీటీ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి నరసింహులు యాదవ్, జయకుమార్, తిరుపాల్ బాబు, జేమ్స్, శివశంకర్‌నాయుడు, కార్పొరేటర్ కురువ పరమేష్ పాల్గొన్నారు.

దాడులు అనైతికం: బీజేపీ

కర్నూలు(కల్చరల్): నిజాలను నిర్భయంగా రాసే పత్రికల స్వేచ్ఛపై హింసాత్మక దాడులు అనైతికమైన చర్య అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. బుధవారం నగరంలోని 46వ వార్డు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూకలు చేసిన దాడుల చిత్రాలను ఆయన ఫోన్ ద్వారా ప్రదర్శించారు. అలాగే మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడిని తీవ్రంగా ఖండించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పత్రికా స్వేచ్ఛపై హింసాత్మక దాడులు జరుగుతున్నాయని దీన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురవరం గీతామాధురి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాముల యాదవ్ పాల్గొన్నారు.



సి.బెళగల్‌లో..

దాడులను ఖండించండి: సీఐటీయూ

కర్నూలు(న్యూసిటీ): పత్రికా కార్యాలయాలు, విలేఖరులపై జరుగుతున్న దాడులను ఖండించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజి బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మొన్న రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై జరిగిన దాడిని మరువక ముందే మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్, ఈనాడు పత్రికా కార్యాలయంపై దాడులు చేయడం అన్యాయమన్నారు. విలేకరులపై జరుగుతున్న దాడు లకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

చర్యలు తీసుకోవాలి

గూడూరు: మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖరుపై, కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవా లని గూడూరు మండల ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఉరుకుంద డిమాండ్ చేశారు. బుధవారం గూడూరులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా ఉరుకుంద మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరిస్తూ విలేకరులపై, పత్రికా కార్యాలయాలపై దాడులకు దిగడం తగదన్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు శ్రీనివాస నాయుడు, కిరణ్ కుమార్, గిడ్డయ్య, రిటైర్డ్ ఉద్యోగి మిన్నెల్లా హుసేన్ పాల్గొన్నారు.

వైసీపీ మూకలను అరెస్టు చేయాలి

సి.బెళగల్: మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడి చేసిన వైసీపీ మూకలను అరెస్టు చేయాలని ఏపీడబ్ల్యూజే నాయకులు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా టీడీపీ జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు దూద్‌వలి మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి మరువక ముందే.. ఆంధ్రజ్యోతి మద్దికెర రిపోర్టర్ వీరశేఖర్‌పై దాడి చేయడం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు జగన్, రమేష్, విలేకరులు పాల్గొన్నారు.



హుశేనాపురంలో నిరసన తెలుపుతున్న మల్లెల రాజశేఖర్, టీడీపీ నాయకులు



కర్నూలులో ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



ఓర్వకల్లులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విలేకరులు, టీడీపీ నాయకులు



గూడూరులో..

పోలింగ్ స్టేషన్ల మార్పుకు అవకాశం

» 24లోపు రాతపూర్వకంగా తెలియజేయాలి
» ఆర్‌యూలో స్ట్రాంగ్ రూమ్స్ కౌంటింగ్ కేంద్రాలు
» కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: ఈ నెల 24వ తేదీ వరకు పోలింగ్ స్టేషన్ల మార్పులకు అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి.సృజన రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల మార్పు ఒక ప్రదేశం నుంచి వేరొక ప్రదేశానికి ఓటర్లకు దగ్గరగా ఉండేలా మార్పునకు అవకాశం ఉందని అన్నారు. ఈ నెల 24లోపు రాతపూర్వకంగా తెలియజేయాల్సిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ప్రజలు పోలింగ్ స్టేషన్‌కు చేరుకోవడానికి ఏమైనా ఇబ్బందులుంటే మార్చుకోవచ్చని తెలిపారు. 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న చోట అదే స్థానంలో సహాయక (ఆక్సిలరీ) పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు అవకాశం ఉందని వెల్లడించారు. రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు కేటాయించబడిన సిబ్బంది అందరికీ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ సమావేశానికి బహుజన పార్టీ తరుపున ఎ.అరుణ్‌కుమార్, బీజేపీ పీటీ సాయిప్రదీప్, వైసీపీ కె.పుల్లారెడ్డి, టీడీపీ ఎల్‌వీ ప్రసాద్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించండి: జేసీ

పాణ్యం నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో పాణ్యం శాసనసభ నియోజకవర్గ ఏఈఆర్‌లు, సెక్టోరల్ అధికారులు, సెక్టోరల్ పోలీసులు, ఎంసీసీ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సున్నితమైన సమస్యాత్మకైన పోలింగ్ స్టేషన్లను వెంటనే గుర్తించి అక్కడ గతంలో జరిగిన ఘటనలను రికార్డు చేసుకోవాలని అన్నారు. ఆయుధాల అప్పగింత, మద్యం సరఫరా, నగదు పట్టివేత, మాదకద్రవ్యాల వినియోగం, సరఫరా, ఎన్నికల నియమాలను అతిక్ర మించడం తదితర విషయాలన్ని సేకరించుకుని సెక్టోరల్ అధికారులు వివరంగా సర్వేపై చేసి నిర్దేశిత ప్రొఫార్మాలో పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌వోలు పాణ్యం తహసీల్దార్ ఫణికు మార్, గడివేముల డీటీ గురునాథ్, ఓర్వకల్లు తహసీ ల్దార్ నటరాజ్, కల్లూరు తహసీల్దార్ మునివేలు, పాణ్యం ఎలక్షన్ డీటీ అనురాధ, జిల్లా ఎలక్షన్స్ సూపరింటెండెంట్ మురళి, సెక్టోరల్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

వైసీపీది అరాచక పాలన: దస్తగిరి



ప్రజలతో మాట్లాడుతున్న బొగ్గుల దస్తగిరి

కోడుమూరు(రూరల్), ఫిబ్రవరి 21: రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని టీడీపీ నాయకుడు బొగ్గుల దస్తగిరి అన్నారు. బుధవారం సాయంత్రం ముడుమలగుర్తి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పథకాలను వివరించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందడం లేదని రైతులు మొరపెట్టుకున్నారు. చేనేతలు తమకు టీడీపీ ప్రభుత్వంలోనే మేలు జరిగిందని, ప్రస్తుతం ముడిసరుకుల ధరలు విపరీతంగా పెంచారని తెలిపారు.

విలేకరులపై దాడి సిగ్గుచేటు: విలేకరులపై వైసీపీ మూకలు దాడి చేయడం సిగ్గుచేటని బొగ్గుల దస్తగిరి అన్నారు. ముడుమలగుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా సంస్థలు, విలేకరులపై దాడులు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు పట్టెక్రిష్ణ, జక్కపోగు సురేష్, వర్కూరు క్రిష్ణ, మద్దూరు హనుమంతు, గడ్డమయ్య, జొల్లు రాముడు, రఘుపతి, ఈశ్వరయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ ఎం అబ్దుల్ హక్ జయంతి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 21: ఉస్మానియా కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.అబ్దుల్ హక్ 123వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉస్మానియా కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాయలసీమలో విద్య వ్యాప్తికి ఎనలేని కృషి చేసిన డాక్టర్ అబ్దుల్ హక్ సేవలను స్మరించుకుంటూ రెండు రోజులపాటు వివిధ కార్యాక్రమాలు చేపట్టారు. ఉస్మానియా కళాశాల గ్రంథాలయంలో ఖురాన్ పఠనం చేసి దువా చేశారు. విద్యార్థులకు ఖురాన్ పఠణం, నాత్ చదవటంలో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రాజావేద్ నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వండి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21: పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని బాధిత రైతులు కోరారు. బుధవారం మండలంలోని పాలకొలను గ్రామంలో ఇంటి పట్టాలపై పరిశీలనకు తహసీల్దార్ నటరాజ్, ఆర్ఐ రంగస్వామి వెళ్లారు. గమనించిన బాధిత మహిళా రైతులు గ్రామ స్థులతోపాటు టీడీపీ నాయకులు సుధాకర్ రెడ్డి వెళ్లారు. 151 సర్వే. నెంబరులో దాదాపు 60 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, ఆ స్థలంలోనే 350 పట్టాలకు లేఅవుట్లు వేసి అప్రూవల్ చేశారని, ఇదే స్థలంలోనే ఇంటి పట్టాలు ఇవ్వాలని రైతులు అధికారులకు వివరించారు. 151 సర్వే.నెంబరులో 6 మంది పేద రైతులు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున 11 ఎకరాలకు 55 లక్షల దాకా బీడు భూములను సాగులోకి తెచ్చుకుని, ఆ పొలంలో బోర్లు వేయించి చీని, పొగాకు, మిరప, పంటలను సాగు చేసుకుంటున్నామన్నారు. ఇటీవల వేసిన లేఅవుట్‌ను తహసీల్దార్ నటరాజ్ పరిశీలించారు. బాధిత మహిళా రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ రజక సాధికార కమిటీ కర్నూలు అధ్యక్షురాలిగా రేణుక

కల్లూరు, ఫిబ్రవరి 21: కర్నూలు పార్లమెంట్ మహిళా రజక సాధికార కమిటీ అధ్యక్షురాలిగా సి.రేణుక నియామకమయ్యారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీటీ.నాయుడు రేణుకకు నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రజకులకు రక్షణ కరువైందన్నారు. సి.రేణుక మాట్లాడుతూ టీడీపీ గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రజక సాధికార కమిటీ అధ్యక్షులు మాలంగిరి గణేష్, కర్నూలు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు ముంతాజ్ బేగం, సభ్యులు సీపీ.వెంకటేష్, కిట్టు. విజయలక్ష్మి పాల్గొన్నారు.

పావనీ లత కుటుంబానికి ప్రశంసాపత్రం

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 21: అవయవదాత పావనీ లత కుటుంబానికి ఏపీ జీవన్‌ధాన్ నుంచి ప్రశంసాపత్రం అందింది. ఈ మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి బుధవారం తన చాంబరులో ఏపీ జీవన్‌ధాన్ నుంచి వచ్చిన ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటి సారిగా అవయవదానం చేసిన పావనీలత, నలుగురికి జీవితాన్ని ఇవ్వగలిగిందని కొనియాడారు. విజయవాడ, హైదరాబాదుకు గ్రీన్ చానల్ ద్వారా గుండె, ఊపిరితిత్తులు, కర్నూలు జీజీహెచ్, కిమ్స్ ఆసుపత్రులకు కిడ్నీలను తరలించినట్లు తెలిపారు. పావనీలత కుటుంబ సభ్యులను ఏపీ జీవన్‌దాన్ ప్రత్యేకంగా అభినందించి పంపిన ప్రశంసాపత్రాన్ని ఆయన పావనీలత తండ్రి ప్రతాప్ రెడ్డి అక్క మాధవీలత, తమ్ముడు దీపక్ రెడ్డి, సభ్యులు సీఎస్‌ఆర్‌ఎంవో వెంకటేశ్వరరావు, జీవన్‌ధాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోఆర్డినేటర్స్ బి.సురేష్‌కుమార్, హర్షద్ పాల్గొన్నారు.

ఇతర భాషలపై ప్రావీణ్యం అవసరం

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 21: మాతృబాషాతోపాటు ఇతర భాషలపై ప్రావీణ్యం ఎంతో అవసరమని ఉర్దూ యూనివర్సిటీ ఉపకులపతి ఫజులూర్ రెహెమన్ అన్నారు. బుధవారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో జాతీయ ఉర్దూ సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆంగ్ల విద్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉండడంతో మాతృ భాషాలో విద్యను అభ్యసించేందుకు ఆసక్తి చూపడం లేదని, తద్వార మాతృభాష తన ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఉస్మానియా కళశాల కరస్పాండెంట్ అజ్రాజావేద్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. ఈ సదస్సులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు, ఉస్మానియా కాలేజి ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్, హాఫీజ్ ఖాన్ మెమోరియల్ ట్రస్టు చైర్మెన్ మెయిజ్ ఖాన్, అమీర్ అహమ్మద్, జెఎండీ షరీఫ్; హుసేని, డాక్టర్ కౌసల్య దేవి, ఇర్ఫాన్, ఖజామొద్దీన్, ఇంతియాజ్, జహనారా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో యునాని రీసెర్చ్ సెంటర్

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 21: రాష్ట్ర విభజన తర్వాత మొట్టమొదటి కేంద్ర ప్రభుత్వ సంస్థ యునాని రీసెర్చ్ సెంటర్ కర్నూలు జిల్లా ప్రజలకు త్వరలో అందుబాటులో వస్తుందని కర్నూలు ఎంపీ సంజీవకుమార్ పేర్కొన్నారు. బుధవారం నేషనల్ యునాని రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ యూనిస్ మున్షి సభ్యులు సెంటర్‌కు కేటాయించిన రెండెకరాల భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో యునాని వైద్యులు జవాదుల్ హక్, రమేష్, హబీబుల్లా, రిటైర్డు తహసీల్దార్ రోషన్ ఆలి పాల్గొన్నారు.

నాసిరకం మందులు విక్రయిస్తే చర్యలు: ఏవో

సి.బెళగల్, ఫిబ్రవరి 21: రైతులకు నాసిరకం పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం కొత్తకోట గ్రామంలోని పురుగుల మందుల దుకాణాలను ఆయన పరిశీలిం చారు. ఈసందర్భంగా ఏవో మల్లేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పురుగుల మందుల దుకాణం యజమానులు రైతులకు విక్రయించే ప్రతి దానికి బిల్లులు అందజేయాలన్నారు. ఏవో వెంట రైతులు, ఎంపీఈవోలు వెంకటేశ్, సిద్దు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

గూడూరు, ఫిబ్రవరి 21: గూడూరు నగర పంచాయతీ పరిధిలో చేపట్టిన పారిశుధ్య పనులను నగర కమిషనర్ దివాకర్ రెడ్డి పరిశీలించారు. బుధవారం గూడూరులో కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులు చేపట్టాగా కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట ఏఈలు నరసింహులు, వైష్ణవి, శానిటరి ఇన్‌స్పెక్టర్ రవి ఉన్నారు.

జయహో బీసీ మహాసభను జయప్రదం చేద్దాం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 21: త్వరలో పత్తికొండలో నిర్వహించే జయహో బీసీ మహాసభను జయప్రదం చేద్దామని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అధ్యక్షతన జయహో బీసీ మహసభపై జిల్లాలోని బీసీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అంతక ముందుకు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ జయహో బీసీ మహాసభను 50 వేల మందితో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాష్ట్ర బీసీ సెల్ రాష్ట్ర కమిటీ నాయకులు, వై.నాగేశ్వరరావు యాదవ్, పీజీ నరసింహులు యాదవ్, సంజీవ లక్ష్మి, ముంతాజ్. తిరుపాల్ బాబు పాల్గొన్నారు.

టీజీ వెంకటేశ్‌కు అభినందన



టీజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్జా రామకృష్ణ, పత్తి ఓబులయ్య

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 21: ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఇటీవల అవార్డు అందుకున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను బుధవారం మౌర్య ఇన్‌లోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టీజీ వెంకటేశ్ రాజ్యసభ సభ్యులుగా ఉన్న సమయంలో కర్నూలు పౌరుషానికి చిహ్నమైన కొండారెడ్డి బురుజుకు కేంద్ర నిధులతో మెరుగులు దిద్దడంలో కృషి చేశారని అన్నారు. అదేవిధంగా జిల్లాలో సాంస్కృతిక, సాహిత్య రంగాల పురోభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో ఉందన్నారు.

సాంస్కృతిక జీవనానికి ప్రాతినిథ్యం వహించేదే మాతృ భాష



తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ

కర్నూలు(కల్చరల్), ఫిబ్రవరి 21: ఒక ప్రాంత చరిత్రకు, సాంస్కృతిక జీవనానికి ప్రాతినిథ్యం వహించేదే మాతృ భాష అని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా, నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం), సాహితీ సదస్సు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. తొలుత సాహితీవేత్తలతో కలిసి తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి వందనం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి తన ప్రాంతంలోని మాతృభాషే ముఖ్యమన్నారు. సభాధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ అనేక యాసలు, సామెతలు, జాతీయాలు, నానుడులను తెలుగు భాష కలిగి ఉండటం తెలుగు వారందరికీ ఒక గొప్ప వరమని చెప్పారు. గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో దేశాలు తమ మాతృ భాష పట్ల శ్రద్ధ కలిగి ఉన్నాయని గుర్తు చేశారు. సమావేశంలో నరసం జిల్లా కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి సమన్వయ కర్తగా వ్యవహరించి ఈ సమావేశంలో నగరం అధ్యక్షురాలు కా.వెం. సుబ్బలక్ష్మమ్మ, సాహితీవేత్తలు జేఎస్‌ఆర్‌కే శర్మ, ఎస్‌డీవీ అజీజ్, షేక్షావలి, అధ్యాపకులు జ్యోతిర్మయి, లత, జయసుశీల, నాగమ్మ, మణికంఠ, జయలక్ష్మి, విజయలక్ష్మి, అనస్తీషియా వైద్యురాలు డాక్టర్ జయలక్ష్మి నాయుడు సౌజన్యం పాల్గొన్నారు.

కర్నూలు(ఎడ్యుకేషన్): అమ్మ భాష కమ్మనైనదని, తెలుగులో మాట్లాడితే జీవితం ఆనందంగా ఉంటుందని తెలుగు భాష వికాస ఉద్యమ నాయకులు జేఎస్‌ఆర్ ఆక్కే శర్మ అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌ఏపీ క్యాంపు కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో వేడుకలు బుధవా రం ప్రధానోపాధ్యాయుడు టి వెంకటరెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగాయి. అనంతరం అక్షర జ్యోతి అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అడిషనల్ కమాండెంట్ ఎస్ మహబూబ్ బాషా మాట్లాడుతూ మాతృభాషాను బాగా నేర్చుకుంటే ఇతర భాషల్లో బాగా రాణించవచ్చునన్నారు. అంతకముందు పూర్వ విద్యార్థిని అంజిలికి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జయలక్ష్మి, బాలస్వామి, పేరెంట్స్ కమిటీ నాయకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలంపై జులుం సహించం



పత్తికొండలో..



ఆదోనిలో..


హాలహర్విలో..



ఎమ్మిగనూరులో..


ఆలూరులో..

ఆదోని, ఫిబ్రవరి 21: వాస్తవాలు వెలుగులోకి తెస్తున్న పత్రికలు, టీవీ చానళ్ల గొంతు నొక్కాలని సీఎం జగన్ కుట్ర పన్నుతున్నాడని, మీడియా స్వేచ్ఛను హరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు బత్తిన మల్లికార్జున అన్నారు. మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడి, కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడి ఘటనలను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు భీమాస్ కూడలి మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం కార్యాలయ పరిపాలనాధికారి శేషయ్యకు వినతిపత్రం సమర్పించారు.

హొళగుంద : పత్రికా స్వేచ్ఛపై దాడిని నిరసిస్తూ హొళగుందలో ఏపీయూడబ్ల్యూజే మండల గౌరవ అధ్యక్షుడు అమీర్ సాబ్, బీజేపీ మండల అధ్యక్షుడు ఈడిగ ప్రసాద్ గౌడ్, సీఐటీయూ మండల అధ్యక్షుడు నాగరాజు, కాంగ్రెస్ నాయకుడు మంగయ్య ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఎంఎం ప్రసాద్ రాజుకు వినతిపత్రం అందించారు.

ఆలూరు : జర్నలిస్టులకు సంఘీభావంగా మాజీ ఎంపీపీ బిల్లేకల్ వెంకటేష్, సీపీఎం, సీపీఐ నాయకులు నారాయణస్వామి, భూపేష్, షాకీర్, గోపాల్, టీడీపీ నాయకులు మద్దిలేటి, శివ, విష్ణు, లక్ష్మిపతి ఆధ్వర్యంలో ఆలూరు అంబేడ్కర్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం చేరుకొని ఆర్ఐ బసన్న గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు స్వరూప్ కుమార్, శ్రీధర్, చంద్రమోహన్, ఆలూరు తాలూకా అధ్యక్షులు సురేష్, మండల అధ్యక్షులు వీరభద్రి, నాయకులు యశోద కుమార్ తదితరులు పాల్గొన్నారు

ఆస్పరి: జర్నలిస్టులపై దాడులు చేయడం అమానుషమని టీడీపీ ఎంపీటీసీ రహింతుల్లా, టీడీపీ యూత్ నాయకుడు సతీష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక గాంధీపార్కులో విలేకరులపై జరుగుతున్న దాడులకు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మహేష్, సాగర్, నారాయణ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : మీడియాపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ విద్యార్థి, ప్రజాసంఘాలు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పట్టణంలో రాస్తారోకో నిర్వహించి తహసీల్దార్ కార్యాయలం ఎదుట ధర్నా చేపట్టారు. ఏపీయూడబ్ల్యూజే తాలుక అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాస నాయుడు, చిన్నాకుల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పరమేశ్వర, నాయకులు నూర్, బాషా, శివ, మక్బుల్, రామకృష్ణ, ఈరప్ప, టీడీపీ పట్టణ అధ్యక్షుడు సుందరాజు, సీపీఐ చిన్నన్న, ఏఐకేఎంఎస్ నాయకులు సత్యన్న, బాలరాజు, ఏఐవైఎఫ్ నాయకులు రాజీవ్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు నాయకులు విజేంద్ర, మహేంద్ర, ఏఐటీయుసీ నాయకులు తిమ్మగురుడు పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి మద్దికేర రిపోర్టర్ వీరశేఖర్‌పై దాడిచేసిన వైసీపీ ఎమ్మెల్యే కాటసాని అనుచరలు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పెద్దకడుబూరు : వైసీపీ మూకల దాడులను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి రెవెన్యూ సిబ్బంది శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం నాయకులు సోమన్న, పుల్లయ్య, భీమన్న మాట్లాడారు. సంఘం నాయకులు నారాయణ, ఈరన్న, రామన్న, మల్లికార్జున, లింగమూర్తి, రాజు,ఎలియాస్‌లు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్ : మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడికి పాల్పడిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ఏపీయూడబ్లూజే నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు సాలురంగడు, గౌరవాధ్యక్షులు రంగన్న, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్‌గౌడు, సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు, సీపీఐ, టీడీపీ, ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేశారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు ఇర్ఫాన్, నాగరాజు, మంజునాథ్, హరి, పక్కీరప్ప, మధుగౌడు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర : ప్రజాస్వామ్యబద్ధంగా అక్రమాలను వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల హక్కు అని, అలాంటి వారిపై దాడులు చేయడం సిగ్గు చేటని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు గద్దల రాజు, ఏపీయుడబ్లూజే మండల అధ్యక్షుడు కె.వీరశేఖర్ అన్నారు. మద్దికెర ప్రధాన బస్టాండు వద్ద రాస్తారోకో నిర్వహించి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకొని ధర్నా నిర్వహించి తహసీల్దార్ రజాక్‌వలికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, సీపీఐ, జనసేన నాయకులు ఎన్.లక్ష్మీనారాయణ, సుధాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ : టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ ,డీసీసీ అధ్యక్షలు బాబారావు, సీపీఎం జిల్లా నాయకులు వీరశేఖర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టికి విన్నతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న ,మలకన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల : ఏపీయూడబ్ల్యూజే, టీడీపీ, జనసేన నాయకులు, జర్నలిస్టులు ఎమ్మిగనూరు కర్నూలు ప్రధాన రహదారి పై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. టీడీపీ మండల కన్వీనర్ నజీర్‌సాహెబ్, నాయకులు రామాంజినేయులు, తిరుపతయ్యనాయుడు జనసేన నాయకులు గానుగబాషా, మాలిక్‌బాషా, జర్నలిస్టు సంఘం నాయకులు గౌస్, అక్బర్‌బాషా, కలీల్‌బాషా, దండుఖాజా తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం : మీడియాపై దాడులు చేస్తున్న వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని విద్యార్థి, ప్రజాసంఘాలు, తెలుగుదేశం, జనసేన, వామపక్ష పార్టీల నేతలు ఆందోళనకు దిగారు. జర్నలిస్టులకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించి రాఘవేంద్ర సర్కిల్, అంబేడ్కర్ విగ్రహం మీదుగా ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకని ధర్నా నిర్వహించారు. టీడీపీ తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బూదూరు మల్లికార్జున రెడ్డి, టీడీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, ఏపీయూడబ్లూజే నియోజకవర్గ అధ్యక్షులు జయరాజు, ప్రధాన కార్యదర్శి హుశేనీ, జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముత్తు సుమాల పాల్గొన్నారు.

కౌతాళం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ అలెగ్జాండర్‌కు అందజేశారు. నాయకులు ఆరిఫ్, దూద్‌బాషా, రామాంజనేయులు, మహమ్మద్, నాగభూషయ్య స్వామి, ముక్తర్, ఉమేష్, రమేష్, ముదుకప్ప, అంజి, అంజి, రాముడు, మంజు, శరణ, భీమేష్ పాల్గొన్నారు.

> 'భారత రాజ్యాంగం అంటే జగన్ సర్కార్‌కు లెక్కేలేకుండా పోయింది. తమ అవినీతి అక్రమాలను బయటపెడుతున్న విలేకరులపై సీఎం భౌతిక దాడులు చేయించి, దౌర్జన్యాలకు ప్రోత్సహిస్తున్నారు. రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదు. పత్రికలన్నీ అబద్దాలు రాసుకుంటూ భజన చేయాలా? మీడియాపైనే దాడులకు దిగుతుంటే, ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడుంటుంది. రాప్తాడు సంఘటన మరవకముందే ఈనాడు కార్యాలయంపై, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై దాడి చేసిన వైసీపీ మూకలను, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి.
>
> \- జర్నలిస్టు సంఘాల నాయకులు

జర్నలిస్టుల నిర్బంధం

● అనంతపురం వెళ్లకుండా స్టేషన్‌కు తరలింపు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 21: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడికి నిరసనగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ చలో అనంతపురం పిలుపునిచ్చింది. జర్నలిస్టులు అనంతపురం వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ ఏపీయూడబ్ల్యూజే నాయకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అంతేకాకుండా నాయకుల ఇళ్లకు వెళ్లి సీఆర్‌పీసీ నోటీసులు అందజేస్తున్నారు. ఛలో అనంతపురానికి అనుమతి లేదని, తమకు తెలియకుండా వెళితే అరెస్టు చేయాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఆదోని ఏపీయూడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు, ఆంధ్రజ్యోతి వీసీ ఇన్‌చార్జి బత్తిన మల్లికార్జునను రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గోపి అదుపులోకి తీసుకొని నోటీసులు జారీ చేశారు. స్టేషన్‌లోనే రాత్రివరకు కూర్చోబెట్టుకున్నారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఉపాధ్యక్షుడు దేవదాసును, ప్రధాన కార్యదర్శి హుస్సేన్‌ను ఆర్థిక కార్యదర్శి సురేంద్రను మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి నోటీసులు అందజేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని కలంపై దాడులు సిగ్గుచేటని నాయకులు నినదించారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోసిగి, పత్తికొండలో ఏపీయూడబ్లూజే నాయకులను స్టేషన్‌కు తరలించారు.


ఆస్పరిలో ..


హొళగుందలో



మంత్రాలయంలో..



కౌతాళం..

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 21: 2024-25 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదోని పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత అయినా, ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు ఉంటుందని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న జరుగుతుందని పేర్కొన్నారు.

పదో తరగతి జీవితానికి తొలి మెట్టు


మోడల్ టెస్టులో విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న మురళీబాబు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 21: పదో తరగతి జీవితానికి తొలిమెట్టు లాంటిదని జ్యోతిర్మయి విద్యాసంస్థల అధినేత మురళి బాబు అన్నారు. బుధవారం ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోడల్ టెస్టులో ప్రతిభ కనబరచిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా జ్యోతిర్మయి విద్యాసంస్థల అధినేత మురళి బాబు, లైబ్రేరియన్ సుజాత, మున్సిపల్, నెహ్రూ మెమోరియల్ పాఠశాల హెచ్ఎంలు మల్లికార్జున, అలీం సిద్ధిఖీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి : జీసీడీఓ

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 21: విద్యార్థినులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివితేనే పరీక్షల్లో విజయం సాధించవచ్చని సమగ్ర శిక్ష జీసీడీవో సునీత అన్నారు. బుధవారం ఆదోని వైఎస్సార్ నగర్‌లోని కస్తూరిబా గాంధీ బాలికల జనరల్ విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థినులకు పరీక్షల పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కేజీబీవీ విద్యాలయం ప్రిన్సిపాల్ శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని ఆ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎంఎండీ నూర్ అహమ్మద్, డీసీసీ ఉపాధ్యక్షుడు దేవిశెట్టి ప్రకాష్ అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసే వారి సంఖ్య పెరుగుతోందని, ప్రతి నియోజకవర్గం నుంచి 5 నుండి ఏడుగురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఇంతవరకు 175 అసెంబ్లీ స్థానాలకు 810 మంది అభ్యర్థులు, 25 పార్లమెంట్ స్థానాలకు 110 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం చూస్తుంటే కాంగ్రెస్‌కు విజయావకాశాలు మెరుగుపడినట్లు తెలుస్తోందని పేర్కొన్నారు.

మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారు


ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శేఖర్‌తో టీడీపీ నాయకులు

ఆలూరు, ఫిబ్రవరి 21: నిజాలు నిర్భయంగా వెలికి తీసే ఆంధ్రజ్యోతి, ఈనాడు మీడియా సంస్థలపై, విలేకరులపై వైసీపీ మూకలు దాడులు చేయడం మీడియా స్వేచ్ఛను హరించడమేనని ఆలూరు టీడీపీ నాయకులు, న్యాయవాది ప్రవీణ్, మోకా మల్లయ్య, శీనప్ప, రంగన్న అన్నారు. మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేకర్‌పై ఎమ్మెల్యే శ్రీదేవి అనుచరులు దాడి చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. బాధితుడిని కలిసి పరామర్శించి, తాము అండగా ఉన్నామని భరోసా కల్పించారు. మీడియా పై దాడులు చేయడం వైసీపీ ప్రభుత్వ పతనానికి నాంది అన్నారు. దాడులకు పాల్పడిన వైసీపీ గూండాలను అరెస్టు చేసి విలేకరులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

అధికారులపై వైసీపీ నాయకుల ఆగ్రహం

● సేవా పురస్కారాల కార్యక్రమానికి దూరంగా వలంటీర్లు

హొళగుంద, ఫిబ్రవరి 21: సచివాలయ వలంటీర్లంతా సన్మాన కార్యక్రమానికి ఎందుకు హాజరు కాలేదని అధికారులపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్‌ల సేవలకుగాను వివిధ పురస్కారాలతో సత్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. బుధవారం హొళగుందలోని ఆర్‌బీకే గోడౌన్‌లో ఎంపీడీవో ఆజాద్ ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన 231 మంది వలంటీర్లు హాజరు కావాల్సి ఉండగా కేవలం 50 మందిలోపు హాజరవ్వడంపై వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లు హాజరుకాక పోవడానికి కారణం అధికారుల నిర్లక్ష్యమే అంటూ మండిపడ్డారు.

ముగతిలో విగ్రహాల ఊరేగింపు

నందవరం, ఫిబ్రవరి 21: మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం బెల్డోనా రామనాథ శాస్త్రి ఆధ్వర్యంలో నూతన విగ్రహాలను 108 కలశాలతో గ్రామ వీధుల గుండా ఊరేగించారు. శివపార్వతులు, గణపతి, సీతారామలక్ష్మణులు, కుమారస్వామి, నాగేంద్రుడు విగ్రహాలను శివ నామన్ని స్మరించుకుంటూ ఊరేగించారు. అంతకు ముందే ఆలయంలో గంగపూజ, గోపూజ, గణపతి పూజ, యాగ మంట ప్రవేశం లాంటి ప్రత్యేక పూజ లు వేదపండితులు నిర్వహించారు.

మద్యం ధ్వంసం

ఆలూరు, ఫిబ్రవరి 21: ఆలూర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన మద్యాన్ని ధ్వంసం చేశారు. బుధవారం ఆలూరు పంచాయతీ శివార్లలో ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ సోమశేఖర్ తెలిపారు.

ప్రజలే బుద్ధి చెబుతారు


బొందిమడుగులలో పర్యటిస్తున్న కేఈ శ్యాంబాబు

తుగ్గలి, ఫిబ్రవరి 21: అరాచక వైసీపీ పాలనతో ప్రజా విఘాతం కలుగుతోందని, దీనికి సమాధానంగా ప్రజలే బుద్ధి చెబుతారని పత్తికొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొందిమడుగులలో సర్పంచు చౌడప్ప ఆధ్వర్యంలో గ్రామంలో కేఈ శ్యాంబాబు పర్యటించారు. ఈ సందర్భంగా కేఈ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచకాలు మితిమీరిపోయాయని, వాటికి అడ్డుకట్ట వేయాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ పార్టీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేసే విలేకరులపై, వారి కార్యాలయాలపై విచక్షణారాహితంగా దాడులు చేయడం దారుణమని, సమస్యలపై వార్తలు రాస్తే దాడులు చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రతాప్ యాదవ్, ఎద్దులదొడ్డి శేఖర్, శ్రీనివాసులు, రామానాయుడు, బత్తిన లోకనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : బీవీ

● నందవరంలో టీడీపీ ప్రచారం


నందవరంలో మాట్లాడుతున్న బీవీ

నందవరం, ఫిబ్రవరి 21: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని దళిత కాలనిలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీలో భాగంగా బీవీ పర్యటించి, ఇంటింటి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాకా నవరత్నాల పేరుతో ప్రజలను పూర్తిగా నాశనం చేశారన్నారు. రాష్ట్రాన్ని లక్షల కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. రైతులకు వర్షాలు లేక పంటలు నష్టపోతే వారికి కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వలేదని విమర్శించారు. నిజాన్ని నిర్భయంగా రాసే ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికలపై వైసీపీ నాయకులు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు, మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు, మాజీ జడ్పీటీసీ ఈరన్నగౌడు, మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తి, గురురాజారావు, ధర్మాపురం గోపాల్, మస్తాన్, షరీఫ్, రహిమాన్, తెలుగు ఈరన్న, వెంకటేశులు, శ్రీనివాస్, ప్రకాష్, బతకన్న, నరసింహులు, సురేంద్రరెడ్డి, వడ్డె గోపాల్, వీరేష్, ఆదిశేషు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు


స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఫిబ్రవరి 21 : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం ద్వాదశి వేడుకలను పురస్కరించుకొని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. విద్యుత్ కాంతుల మధ్య బంగారు రథం ఊరేగుతుండగా భక్తులు జయహో... గురు రాఘవేంద్ర... విజయహో...., తుంగా తీరా ...నివాసా...గోవిందా....గోవిందా.... అంటూ పెద్దఎత్తున మఠం ప్రాంగాణం మార్మోగింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

ఘనంగా బసప్ప స్వామి రథోత్సవం


సాలెకట్ట బసప్ప స్వామి రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం, ఫిబ్రవరి 21: మాధవరంలోని సాలెకట్ట బసప్ప స్వామి మహా రథోత్సవం వైభవంగా జరిగింది. బుధవారం ఆలయ అర్చకులు చెన్నయ్య స్వామి, జంగం వీరన్నస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాలెబసప్ప చిత్రపటాన్ని, వీరభద్రస్వామి చిత్రపటాలను అధిష్ఠించి సాలెబసప్పకట్ట స్వామి కట్ట నుంచి రాయచూరు రోడ్డు వరకు ఊరేగించారు. బిచ్చాల మఠం పీఠాధిపతి వీరభద్రస్వామి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథ్ రెడ్డి, రఘునాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, వీరారెడ్డి,

ఎస్ఐ మృతికి సంతాపం

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 21: ప్యాపిలి సర్కిల్ పరిధిలోని రాచర్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో అకాల మరణం పొందిన ఎస్ఐ వెంకటరమణ మృతి బాధాకరమని పత్తికొండ అర్బన్ సీఐ మురళీమోహన్, ఎస్ఐలు గోపాల్, వెంకటేశ్వర్లు సంతాపం ప్రకటించారు. బుధవారం తెలంగాణ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ వెంకటరమణతో పాటు అల్లుడు కారు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకటరమణ, పోలీసు సిబ్బంది మౌనం పాటించి సంతాపం ప్రకటించారు.

ఓటుతో అరాచక పాలనకు చరమగీతం

● మైఫస్ట్ ఓట్‌ఫర్ సీబీఎన్ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి

పత్తికొండ, ఫిబ్రవరి 21 : వచ్చే ఎన్నికలలో యువత తమ మొదటి ఓటుతో వైసీపీ అరాచక పాలను చరమగీతం పాడాలని మైఫస్ట్‌ఓట్‌ఫర్ సీబీఎన్ జిల్లా కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాయంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో మైఫస్ట్‌ఓట్‌ఫర్ సీబీఎస్‌పై విలేకర్ల సమావేశం నిర్వహించారు. గత ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల ఓట్లతేడాతో వైసీపీ అధికారంలోకి వచ్చిందని ఈసారి యువత కొత్తఓట్లకోసం రాష్ట్రవాప్తంగా 45 లక్షల మంది దరఖాస్తుచేసుకున్నారన్నారు. ఒక్క అవకాశంపేరిట అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటివరకు ఒక్క జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయక యువతను సీఎం జగన్ మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు మనోహర్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు పాల్గొన్నారు.